# మలుపు మత్తుబాణం

\- శాంతా సూరప్ప



Man become wise only when they are fooled by women
\- Butchi Babu

వెన్నెల రాత్రి వెచ్చగా వుంది. మే నెల తన ప్రతాపం చూపిస్తుంది. చల్ల గాలికి గెస్ట్‌హౌస్ చుట్టూ వున్న గార్డెన్‌లో కూర్చున్నారు వసంత, వనమాలి. కనుచూపుమేర అంతా నిశ్శబ్దం. జన సాంద్రత అంతగాలేని ఏజన్సీ ప్రాంతం చీకటి ముసురుకున్న వెనువెంట ఊరు ముసుగు పెడుతుంది. వెన్నెల వెలుగులో చేతి గడియారం వంక చూశాడు వనమాలి. ఏడు దాటుతుంది.

వనమాలి, వసంత ఇంటర్లో క్లాసు మేట్సు. వనమాలి కాలేజి ఫస్టు వచ్చి ఇంజనీరింగ్ జాయినయ్యాక తరగతి నుండి తన గతికి త్రిప్పకుంది వసంత. బాధ్యత ఎరుగని వయసు, బాదరా బందీ తెలియనివ్వని పోషణ తల మునకలయ్యే ప్రేమకు అనుకూల వాతావరణం. ఫలితంగా వనమాలి చదువు చెట్టెక్కింది. ఆ నాలుగేళ్ళలో వసంత డిగ్రీ పూర్తి చేసి బి.ఇడి. కూడా చేసింది. వనమాలి మాత్రం ఇంజనీరింగ్ పూర్తి చెయ్యలేకపోయాడు. అతడది పూర్తి చేసేస్తే అతడిని పెళ్ళికి ఒప్పిద్దామని చూస్తుంది వసంత. బహుశ అతడికది సాధ్యపడదేమో. కళ్ళు మూస్తే వసంత, కళ్ళు తెరిస్తే కలవరింతలా క్షణం విశ్రాంతి లేకుండా అంతకంతకు ప్రేమాంధుడైపోతున్నాడు. మళ్ళీ బయటకు ఏదీ పట్టించుకోనట్టే కనిపిస్తాడు. కీలెరిగి వాత పెడదామని చూస్తున్న తండ్రికి అతడు ప్రశ్న. ఫెయిలయిన పేపర్లు ప్రిపేరయ్యే లోపల కొడుకుని ఖాళీగా వుంచకుండా తన శాఖ వర్క్స్ చూసే నిమిత్తం వనమాలిని టెంపరీరిగా నియమించాడు. అతడు ఆ శాఖకు అధిపతి కావటంతో వనమాలి వుండేందుకు ఆ ప్రాంతంలో గెస్ట్ హౌస్ ఏర్పాటు చేశాడు. వనమాలిని చూడవచ్చిన వసంతకు అతడి చుట్టూ వున్న ఖరీదైన వాతావరణం తాత్కాలికమే అయినా మరింత ఇష్టాన్ని ఇంజక్ట్ చేసింది. ఆమె మనసులో అతడి పరంగా యాక్సెప్టెన్సీ యాక్సెప్ పెరిగింది.

"అబ్బ... ఏంటి బాబూ.... ఇంత



ఉక్కపోస్తుంది" ఎదపై చున్నీతో యథాలాపంగా విసురుకుంది వసంత. లోనెక్ కుర్తాలో బిగుసుకున్న బిగువులు ఆమె చేతుల కదలికల మధ్య సుతిమెత్తగా గ్రుద్దుకున్నాయి. కూడదనుకున్నా చూడకుండా వుండలేకపోయాడు వనమాలి. అతడి చూపు ఎక్కడుందో గమనించి గుంభనంగా నవ్వుకుంది వసంత.

'స్నానం చేస్తే చల్లగా వుంటుందేమో...' విసురుకుంటూనే అంది.

అతడు వినటం లేదు.

'మిమ్మల్నే...' చున్నీ వదిలేసింది.

దొరికిపోయినట్టుగా చూసి 'ఏంటి...?' తడబడ్డాడు.

'స్నానం చేస్తే చల్లగా వుంటుందేమో...' రిపీట్ చేసింది.

'చెయ్యి అయితే...' చెప్పాడు.

'ఎక్కడ... బాత్‌రూంలోనా...? ఆ నాలుగు గోడల మధ్య చేసి బయటకొచ్చేసరికి ఏసుగు స్నానమే... '

'మరెలా... ఇలా ఓపెన్‌లో చెయ్యటానికి ఆడపిల్లనైతివి...'

'అభ్యంతరమేమిటి... ఇక్కడ ఎవరూ లేరుగా...'

'నేనున్నాగా...'

'నువ్వున్నావనే ధైర్యంతోనేగా... లేకపోతే హమ్మో...' అతడి చేతిని తన చేతుల్లోనికి తీసుకుని గుండెకు ఆనించుకుంటూ 'ఈ అడవిలో ఒంటరిగా...' భయపడుతున్నట్టుగా గట్టిగా హత్తుకుంది.

అతడి ఒంట్లో ఓల్టేజి పెరిగింది.

సింబాలిక్‌గా గార్డెన్‌లో మెర్క్యూరీ లైటు వెలిగింది.

వనమాలి ముందు మొహమాటపడ్డాడు. తరువాత కాసేపు తటపటాయించి రెండో చేత్తో ఆమెను సందిట చేర్చుకున్నాడు.

'హమ్మయ్య... ఒక గొప్ప మాస్టర్ ప్లాన్ వేసి ఇంట్లో వాళ్ళకు మస్కా కొట్టి ఇంత దూరం నీ కోసం ఇబ్బంది పడి వస్తే చివరికి నేను చొరవ తీసుకుంటేనే కాని చేరువ చేసుకోలేదు.' నిష్టూరంగా అంది.

అతడు మాట్లాడలేదు. లైటు స్తంబానికి చేరబడి వసంతను ఎదపై చేరదీశాడు. ఆ చర్యలో అతడికి కోరిక కంటే యెదకు ఆసరా దొరికిందనే తీరిక ఎక్కువ కలిగింది.

'నీళ్ళు పోసుకోనియ్యకుండా నీళ్ళోసుకోనిస్తారా ఏమిటి...?' పైన పడుకో బెట్టుకోవడంతో చిలిపిగా అడిగింది వసంత.

'నీళ్ళోసుకోనివ్వటం అంటే...?'

'ఏం లేదు...' పెదవుల మధ్య నవ్వు దాచేసింది వసంత.

తనకేదో అర్థం కాని మాటని విప్పి చెప్పకుండా గుప్పిట మూసేస్తాదని అలిగి ఆమె చుట్టూ వున్న తన చేతిని వేరుచెయ్యబోతే వారిస్తూ అందామె..

'అయ్యో... నిజంగానే... ఏం లేదని చెప్పాగా...'

అతడా విషయం మరి ప్రస్తావించలేదు. ఉన్నట్టుండి వాతావరణం చల్లబడింది. ఒక్కసారి టెంపరేచర్ పడిపోవడంతో అటుగా వచ్చిన వాన మబ్బు ఆ చల్లదనానికి ద్రవించి వర్షించటానికి ఆయత్తమవుతుంది.

'వర్షం వచ్చేట్టుంది. లోపలికెళ్దాం...' అతడిపై నుండి లేవకుండానే అంది వసంత.

'నువ్వెళ్ళు...' ముక్తసరిగా చెప్పాడు వనమాలి.

'కోపమొచ్చిందా'

అతడు మాట్లాడలేదు...


బహుమతులు అందజేస్తున్నవారు



'అబ్బ... చిన్న మాటకి... వదలరు కదా...' మెత్తగా విసుక్కుని అతడి చెవిలో గుసగసలా మత్తు చల్లింది. వింటూనే అతడి దేహం రోమాంచితం అయ్యింది.

మెల్లగా వాన మొదలయ్యింది...

'ఆరుబయట జలకాలాడుదామనుకున్న నీ కోరిక విని ఆఘమేఘాల మీద పరుగెత్తుకొచ్చినట్టున్నాడు నీ ప్రియుడు...' వానమబ్బుని ఉద్దేశించి చమత్కరించాడు వనమాలి.

'కాదు.. పరుగెత్తించుకొచ్చాడు ఈ ప్రియుడు...' వనమాలి మొహాన్ని దగ్గరకు తీసుకుని సవరించింది వసంత.

ఆ సవరణకి వనమాలి హృదయం సరిగమలు పలికింది.

వాన జోరుగా కురవసాగింది.

నిమిషాలు నిశ్శబ్దంగా వర్షంతో ఘర్షణ పడుతున్నాయి. ఒడిలో ఒదిగి వున్న ఆమెనే పొదిగి చూస్తున్నాడు వనమాలి.

పూర్తిగా తడిసిపోవటంతో వసంత తొడుక్కున్న లేత గులాబి రంగు కుర్తాలో ఆమె ఒంటి పచ్చదనం తెలుస్తుంది. ఒంటికి అతుక్కుపోయిన బట్టల్లో ఆమె శరీరపు అమరికలు స్పష్టాస్పష్టమవుతున్నాయి...

అతడిలో సంచలనం రేగింది.

చలికి అతడి ఒడిలో ఇంకాస్త ఒదిగి కూర్చుంది వసంత. అతడి తలపై పడుతున్న వర్షం ధారగా ఆమె తలపైకి జారుతుంది. పెళ్ళిలో వరుడు తలపై నుండి వధువు తలపైకి నీళ్ళు జారపోసేట్టు... ఆ క్షణం అతడి కెందుకో ప్రకృతి తమకు మంగళస్నానం చేయిస్తున్నట్టుగా అనిపించింది. అలాగే మెర్క్యురీ లైటుపై పడ్డ జల్లు తుంపరగా మారి ముత్యాల్లా మెరిసి తలంబ్రాలు పోస్తున్నట్టు... కొన్ని ఫీలింగ్స్‌కి రీజనింగ్ వుండదు... అనుభూతి పరంగా మనసుకెంతగానో హత్తుకుపోతాయి. వనమాలి విషయంలో అదే జరిగింది.

ఆమెను అభిషేకం చేస్తున్న నీటిని నుదుటి మీద, కళ్ళ మీద, చెక్కిళ్ళ మీద పెదవులతో స్పృశించి తీర్థంలా చప్పరించాడు. ఆమె కాదనలేదు. ఆర్తిగా అనుభవాన్ని ఆహ్వానిస్తూ కళ్ళు మూసుకుంది. అతడు ఇంకొంచెం ముందుకెళ్ళి ఆమె పెదవుల మధ్య ముందు తడిని తరువాత వేడిని రుచి చూశాడు. అప్పుడు ఆమెలో సంచలనం కలిగినట్టు అతడి చుట్టూ చేతులువేసి తనవైపు గట్టిగా హత్తుకుంది.

వాన కురుస్తూనే వుంది.

చలి ఇద్దరినీ ఇంకా ఇంకా దగ్గర చేస్తూంది. ఇద్దరిలోనూ ఇంకా ఏదో కావాలనే ఆరాటం. ఆమెను అతడు ఎక్కడెక్కడో తాకుతున్నాడు. తాకిన చోటల్లా ఆమె ప్రతిస్పందనను గుండెల్లో నిక్షిప్తం చేసుకుంటున్నాడు. జీవితపు తొలి అనుభవం జీవితపు చివరి క్షణం వరకూ నెమరువేసుకునేలా మలచుకోవాలనే అతడి ఆశయం నెరవేర్చుకోవాలని ఇన్నాళ్ళూ చెంతనే వున్నా ఆమె దగ్గర ఎప్పుడూ కక్కుర్తి పడలేదు. కాని ఇప్పడీ కుంభవృష్టిలో సృష్టి రహస్యం ఛేదించేందుకు ప్రకృతి కాంత తన ఒడిలో రంగం సిద్ధం చెయ్యటాన్ని ఓ మనోసిద్ధుడు కుదిర్చిన మహోన్నత ముహూర్తంగా భావించి శ్రద్ధాభక్తులతో ఆచరించసాగాడు. ఆమెకు అదంతా తెలియదు. అతడు చేసిన దానికంతా దాచుకోకుండా రెస్పాండ్ అవుతూంది. అతడిలో లీనమయ్యే ఆ క్షణం కోసం ఆమె ఎన్నాళ్ళుగానో కలలుకంటూంది. తనకు నచ్చిన, తనను మెచ్చిన చెలికానికి తనువును అర్పించుకుని తనివితీరా అనుభవాన్ని రుచి చూడాలనే హద్దు దాటిన కోరికతో పీకలోతుకు మునిగి వుందామె.

ఆమెను వివస్త్రను చెయ్యటానికి అవస్థపడుతున్నాడు వనమాలి. ఆమె స్త్రీ సహజమైన సిగ్గుతో వారిస్తూనే అతడికి సహకరిస్తూంది. కాసేపటికి అతడి ప్రయత్నం ఫలించింది. ఆమె ఒంటిపై నేరుగా వాన కురుస్తూంది. అతడు ఆమెను గొడుగులా కప్పుకున్నాడు... ఆమె గుండె పరియ ఒరిగింది... ఆమె గొంతులో ఉరుము ఉరిమింది. కళ్ళల్లో మెరుపు మెరిసింది... పిల్లవాగు పొంగింది.

ఆ అనుభవంలోని సుఖమేమిటో తరచి తరచి తలకెక్కించుకుంటున్నాడు వనమాలి. తమకంగా అతడిని తనవైపు లాక్కుంటూంది వసంత.

వానజోరుకి గట్టు తెగి పిల్లవాగు పొర్లింది. గట్టునున్న బండరాయి వాటంగా గుంటలో దిగి ఆనకట్ట వేసింది. అప్పుడు మొదలయ్యింది యుద్ధం... తెగిన వాగుకి దిగిన రాతికి....

వానజోరు తగ్గింది...

యుద్ధం పతాకస్థాయికి చేరుకుంది...

సంధి కుదరటంతో ప్రవాహం లోయల్లోనికి దూకింది.

వాన వెలిసింది...


వాగు చెమ్మగిల్లింది.

వోల్టేజి డ్రాప్ అవ్వటంతో సింబాలిక్‌గా మెర్క్యురీ లైటు ఆరిపోయింది. చాలాసేపు చీకట్లో మౌనంగా వుండిపోయారు వనమాలి, వసంత.

చెట్ల ఆకులపై నుండి ఉండి వుండి నీటి బొట్లు రాలుతున్నాయి. దూరంగా నీటి ప్రవాహపు చప్పుడు.

ఒక మబ్బు కురిసి వెళ్ళిపోవటంతో మబ్బుల చాటునుండి తప్పుకుని బయటపడ్డాడు వెన్నెల రేడు..

వసంత సొమ్మసిల్లి పచ్చికలో అలానే వెల్లికిలా పడుకుంది. ఆ వనం మధ్య ఆమె విరగబూసిన వసంతంలా... ఆమె మొహంలో గొప్ప సంతృప్తి. ఆమె చెంత అతడు ఆ వసంతరాణికి వనమాలిలా... ఆమెను చూస్తున్న అతడిలో ఓ అద్భుతమైన అనుభూతి...



అచ్ఛాదన లేని ఆమె రొమ్ములు నిమ్మలంగా నింగివేపు తిరిగి తొంగి చూస్తున్న తుంటరి చంద్రునికి అల్లుకుపోయేందుకు తావిచ్చేశాయి. పసిడి కలశాలుగా భ్రమింపజేస్తున్న ఆమె యదోన్నత శిఖరాల శిఖరాగ్రాన ఊదారంగు రంగరించి బొట్టు పెడితే బొడిప కట్టినట్లు మణుల రీతి ఒప్పిదమౌతున్నయి ...... ఇరువైపులా విల్లులా వంగిన నడుము వంపుల్లో పడ్డ కాంతి రేఖ పరావర్తన చెంది సప్త వర్ణాల్లో సంధించిన కిరణ శరాల తాకిడిని తట్టుకుంటూ లోతుకుపోయిన పొట్ట...

వనమాలి మొదటిసారి స్త్రీని మొత్తంగా చూస్తున్నాడు. ఆమెలోని ప్రతి అణువుని మనసు కాన్వాస్‌పై భావుకత్వపు కుంచెతో శాశ్వత ముద్ర వేస్తున్నాడు. ఆమెనలా చూస్తున్న కొద్దీ హృదయం నిండా ఆమె రూపం నిండి మనసు మూసుకుపోతుంది. మెల్లి మెల్లిగా సిక్ మైండెడ్‌నెస్‌తో మనిషి మానియాక్ అవుతున్నాడు.

ఆ రాత్రి తెల్లవారితే ఆమె వెళ్ళిపోయింది మళ్ళీ వస్తానని చెప్పి...

అతడి వరకూ జరిగింది పవిత్ర ఘట్టమైతే ఆమె వరకూ అదో మధుర జ్ఞాపకం... అన్ని కలిసొచ్చి వీలైతే అతడికి ఆలి అవుతుంది. అనువు కాకపోతే ఒక అనుభవం మిగులుతుంది. అతడు కూడా అలానే తీసుకుంటాడనుకుంది వసంత. మగవాళ్ళెప్పుడూ ఇలాంటి గెట్ టు గెదర్ విషయాల్లో ఫర్‌గెట్ భావంతోనే వుంటారనే వాతావరణంలో పెరిగిందామె...

ఒకరిది లౌకికం... ఇంకొకరిది అలౌకికం... ఇవి రెండూ రెండు పట్టాలు... ఈ పట్టాలపై నడిచే ప్రేమ రైలు ఎంత దూరం ఎంత కాలం పయనించినా గమ్యం వుండదు... ఎక్కడో బ్రేక్‌డౌన్ అవుతుంది. అది ఆదిలోనే అయితే ఆరోగ్యకరం... ఇద్దరికీ అంత బాధ వుండదు. ఆదమరచే దాకా వస్తే అవాంఛనీయం... ఆ స్థితిలో ఒకరి బాధ ప్రామాణికం అయితే మరొకరి బాధ ప్రాణాంతకం అవుతుంది. ఈ ప్రాణాంతకం అయిన బాధే ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. అందులోంచి వలపు ఉగ్రవాదం పుడుతుంది. చంపటమో... చావటమో... అనుకునే విపరీత భావం...

వసంత, వనమాలి ప్రేమకు ఇలాంటి బ్రేక్ ఆ తరువాత తొందరలోనే వచ్చేసింది... వసంత పెళ్ళి నిర్ణయం అయ్యింది...

'ఇంకోర్ని చేసుకోగలవా...?' బరువుగా అడిగాడు వనమాలి.

'చేసుకుంటాను...' తడ బాటు లేకుండా చెప్పింది వసంత.




అది అతడు ఊహించని సమాధానం. షాక్ తిన్నాడు. ఆమె అలా అంటుందని అతడు అనుకోలేదు. తనతోడే జీవితం అంటుందనుకున్నాడు. అయినా తనలోని బాధను దాచుకోలేక సిగ్గువిడిచి అన్నాడు.

'కాని, నువ్వు లేకుండా నేను ఎలా...?'

'లేనని ఎందుకనుకోవాలి... నేను కావాలనుకుని రావాలే కాని...'

ఆమె ఉద్దేశ్యం అతడికి అర్థమయ్యింది... అతడికి ఏడుపొచ్చింది... 'ఇంత లేకి వ్యక్తినా గుండెలో పవిత్రంగా ప్రతిష్టించింది...' కృంగిపోతూనే అభ్యర్థించాడు.

'నా సంగతి తెలిసీ అలా మాట్లాడుతావేం... నన్ను బాధ పెట్టకు... నాతో వచ్చేయ్...'

'ఏం చూసుకుని... ఆ తరువాత నేను బాధపడాలి...' లోపల గొణుక్కుంది వసంత.

అతడి గుండెలో చిన్న జర్క్.

ఇదేమిటి నిజం ఇంత నిర్దయగా వుంది.

ఆమె ప్రేమలోని రిస్క్‌కీ, రిస్క్‌లేని పెళ్ళికి పోటీ పెట్టి ఓటు పెళ్ళికే వేసి 'ఉద్యోగి' రూపంలో తన 'భద్రత' చూసుకుంది...

ప్రేమలో రియాలిటీకి చోటివ్వడం అతడి తప్పు. జీవితంలో రియాలిటీకి ఓటివ్వడం ఆమె ఒప్పు... ఇదే ఆదర్శం, మార్గదర్శకం అవుతుందా...?

ఆదుకుందనుకున్నాడు...

అవమానించిందనుకున్నాడు...

ఆవేశపడదామనుకున్నాడు...

ఆలోచించకూడదనుకున్నాడు...

ఆనందపడదామనుకున్నాడు...

కాని... కాని... కాని...

తన మనసులో తిష్టవేసుకున్న రూపం... తను సున్నితంగా చూసుకున్న రోజా పువ్వు... తను కాక ఇంకొకరి చేతుల మధ్య ఊహించుకోలేకపోయాడు. మెదడు నెవరో బలత్కరిస్తున్న భావన...

ఈ భావుకత్వమే లేకపోతే ఆమెను చేపట్టయినా వుండేవాడు... ఛీ కొట్టయినా వుండేవాడు.

రెండూ జరగలేదు.

అతడి కళ్ళ ముందు ఓ దృశ్యం కదలాడింది.

'నిలువునా బట్టలంతా పెట్రోలుతో తడుపుకుని తొడుక్కున్న జర్కిన్‌లో వసంతను బలవంతంగా చేర్చి జిప్ బిగించి లైటర్‌తో అంటించుకున్నాడు... ప్రేమలో దాతృత్వం ఎంత వుంటుందో శతృత్వం అంత వుంటుంది అనటానికి రుజువుగా మంటల్లో మండి బూడిదై అగ్నిసాక్షిగా ఒక్కటయ్యింది ఆ జంట...' '

అదే దృశ్యాన్ని పదే పదే తర్కించి చూపిన అతడి ఆలోచనలో ఎక్కడో లోపం వుందనిపించింది. ఏ డాది సంఘర్షణ మీదట అతడి కళ్ళ ముందరి ఈ దృశ్యం కనుమరుగయ్యింది.

'ఆడపిల్లయ్యుండి ఆ అమ్మాయి తనని అంత కంఫర్టబుల్‌గా వదిలేసినప్పుడు మగాడయ్యుండి తను చాలా కన్వీనియంట్‌గా ఈ విషయాన్ని వదిలేయవచ్చు...' అనే నిజం స్ఫురించాక అతడు తొందరగానే తనున్న భావుకత్వంలోంచి తేరుకుని వాస్తవాన్ని స్పృశించాడు.

ఆ అమ్మాయిపై ధ్యాసని తనపైకి మళ్ళించుకున్నాడు. తనపై ఓదార్పుని మరో ఆడదానిలో కాకుండా తనలోనే వెతుక్కున్నాడు. చాలా శ్రమపడిన మీదట అతడు మెటీరియలిస్ట్ అయ్యాడు.

ఆపై సుళువుగానే చదువు పూర్తి చేసి తన ఆశయాన్ని ఎన్నుకునే దిశలో సాగిపోయాడు...